క్లుప్తంగా

నూతన వస్త్రాలు అందజేసిన జెడ్పీ చైర్‌పర్సన్



క్వారీ సిబ్బందికి దుస్తులు అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తమ గ్రానైట్ క్వారీలో పనిచేస్తున్న సిబ్బందికి గురువారం నూతన వస్త్రాలు అందించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా నూతన వస్త్రాలు బహూకరించారు.

విద్యార్థులకు నూతన దుస్తుల పంపిణీ



విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

సంతనూతలపాడు: మండలంలోని మిట్టమీద పాలెం ప్రాథమిక పాఠశాలలో గురువారం ఒంగోలు మాజీ డిప్యూటీ డీఈఓ ఒ.అనితరోజ్ రాణి, మురళీమోహన్ చేతుల మీదుగా విద్యార్థులకు నూతన దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి డి.వెంకారెడ్డి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు నరసింహారావు, చైర్మన్ ఆకుల బ్రహ్మయ్య, స్కూల్ హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు, టీచర్ ఉషారాణి, పీడీ వనజ, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కొత్తపట్నం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీకృష్ణ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని చెప్పారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు. అధికారులు ఆయా ప్రగతి నివేదికలు తీసుకు రావాలని సూచించారు. గైర్హాజరైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో హెచ్చరించారు. ఈ నెల 9న జరగాల్సిన సర్వసభ్య సమావేశం కొన్ని అనివార్య కారణాలతో 10వ తేదీకి మార్చినట్లు చెప్పారు.

బీసీ కార్పొరేషన్ యూనిట్లకు దరఖాస్తుల ఆహ్వానం

చీమకుర్తి: బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీపై యూనిట్ల మంజూరుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చీమకుర్తి మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్య గురువారం తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే నిమిత్తం నిరుద్యోగ యువతకు 52 రకాల యూనిట్లు అందించనున్నట్లు చెప్పారు. ఈ నెల 8 నుంచి 16వ తేదీ వరకు సచివాలయాలలో దరఖాస్తులు సమర్పించాలని కమిషనర్ సూచించారు.

నేటి నుంచి క్రికెట్ టోర్నమెంట్

సంతనూతలపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో సంతనూతలపాడు స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తపల్లి బాలకార్తీక్ – నీలం వాసు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ఉదయం ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనేవారు ఎంట్రీ ఫీజు రూ.600 చెల్లించాలన్నారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.20,000, రెండో బహుమతిగా రూ.15,000, మూడో బహుమతిగా రూ.10,000 ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు 96032 02610, 99511 13819, 63000 64252 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

జిల్లా వాసికి డాక్టరేట్



డాక్టరేట్ పొందిన సల్మాన్ అష్రఫ్

ఒంగోలు సిటీ: నాగులుప్పలపాడు మండలం బి.నిడమానూరు గ్రామానికి చెందిన షేక్ సల్మాన్ అష్రఫ్ చెన్నైలోని ప్రతిష్టాత్మక రాజీవ్‌గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. డిపార్టుమెంట్ ఆఫ్ సోషల్ ఇంజినీరింగ్‌లో ప్రొఫెసర్ షర్మిష్టా భట్టాచార్య ఆధ్వర్యంలో 'సోషల్ ఇంక్యూబేషన్' అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ ప్రధానం చేశారు. పీహెచ్‌డీలో మూడు బెస్ట్ రీసెర్చ్ పేపర్ అవార్డ్స్ అందుకున్నారు. ఇదే ఇన్‌స్టిట్యూట్‌లో 2015–17లో సోషల్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కోర్సులో మాస్టర్స్ పూర్తి చేసి గోల్డ్ మెడల్ అందుకున్నారు. తండ్రి షేక్ కాలేషా వలి ప్రభుత్వ స్కూల్ టీచరుగా పనిచేస్తున్నారు. డాక్టరేట్ ప్రధానోత్సవం కార్యక్రమంలో ప్రొఫెసర్లు, రీసెర్చ్ స్కాలర్స్, గ్రామస్తులు, బంధువులు సల్మాన్ అష్రఫ్‌కు అభినందనలు తెలిపారు.

సదస్సులతోనే సరి..

అర్జీదారులు వర్రీ..!

- సంతనూతలపాడు నియోజకవర్గంలో మొక్కుబడిగా జరిగిన రెవెన్యూ సదస్సులు
- సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఆందోళనలో అర్జీదారులు
- భూ సమస్యలపై రైతుల నుంచి భారీగా వచ్చిన అర్జీలు
- వేళ్లపై లెక్కించే స్థాయిలోనే పరిష్కారాలు
- ఉపయోగం లేని సదస్సులపై తీవ్రస్థాయిలో విమర్శలు



పేర్నమిట్టలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

సంతనూతలపాడు: ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సులతో రైతులు, ప్రజలకు ఒరిగిందేమీ లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మొక్కుబడిగా సాగిన సదస్సులతో తమ సమస్యలు పరిష్కారమయ్యేలా లేవని ప్రజలు చర్చించుకుంటున్నారు. సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో గల రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రైతులు పట్టాదారు పాసు పుస్తకాలు, సరిహద్దు సమస్యలు, మ్యుటేషన్, ఇతర మార్పులు, చేర్పులు, తదితర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ అర్జీలు అందజేశారు. అయితే, రెవెన్యూ సదస్సుల్లో అధికారులు ఎక్కువగా చిన్నాచితకా సమస్యలకే ప్రాధాన్యత ఇచ్చారు. అప్పటికప్పుడు కొందరికి అవసరమైన ఫ్యామిలీ మెంబర్, ఇతర ధ్రువీకరణ పత్రాలు అందించి మమ అనిపించారు. రైతుల భూములకు సంబంధించి దీర్ఘకాలికంగా తిష్టవేసిన రెవెన్యూ సమస్యల గురించి పట్టించుకోలేదు. వాటిపై మొక్కుబడిగా అర్జీలు స్వీకరించి చూస్తాం.. చేస్తామంటూ చెప్పి వెళ్లిపోయారు. గతంలో నిర్వహించిన సదస్సుల్లోనే ఇలాగే చేశారు. ఇప్పుడూ అదే జరగడంతో పాటు అధికారుల నుంచి పెద్దగా స్పందన లేకపోవడంతో ఈసారి కూడా తమ సమస్యలు పరిష్కారమయ్యేలా లేవంటూ రైతులు, ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

బుధవారంతో ముగిసిన రెవెన్యూ సదస్సులు...

సంతనూతలపాడు నియోజకవర్గంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు బుధవారంతో ముగిసాయి. గత నెల 6వ తేదీ ఈ సదస్సులు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు నిర్వహించిన సదస్సులకు వందల సంఖ్యలో సమస్యలపై అర్జీలు అందాయి. కానీ, వాటిలో పరిష్కారాలు మాత్రం పదుల సంఖ్యలోనే ఉన్నాయి. భారీగా పెండింగ్ అర్జీలు ఉండటంతో సదస్సులు ఎందుకు నిర్వహించారో అర్థంకావడం లేదని రైతులు విమర్శిస్తున్నారు.

భారీగా సమస్యల ఏకరువు...

రెవెన్యూ సదస్సుల్లో అధికారులకు రైతులు తమ సమస్యలను భారీగా ఏకరువు పెట్టారు. అయితే, దీర్ఘకాలికంగా పరిష్కారం కాని అర్జీలపై రెవెన్యూ అధికారులు మొక్కుబడిగా స్పందించారు. ఐదేళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు గ్రామాల్లో తూతూమంత్రంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చాక అదే విధంగా సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సుల నిర్వహణకు ప్రభుత్వం జిల్లాకు రూ.10 లక్షల బడ్జెట్ కూడా కేటాయించింది. కానీ, అప్పుడూ..ఇప్పుడూ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో రెవెన్యూ సదస్సులతో ఉపయోగం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మమ అనిపిస్తున్న అధికారులు...

రెవెన్యూ సదస్సులకు మండల రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు, సర్వేయర్లు, సబ్ రిజిస్ట్రార్లు, దేవదాయశాఖ అధికారులు హాజరుకావాల్సి ఉంది. కానీ, అనేక చోట్ల వీఆర్వోలు, సర్వేయర్లు, రెవెన్యూ అధికారులతోనే సదస్సులు నిర్వహించారు. కానీ, ఆ రెవెన్యూ సమస్యలే పరిష్కారం కాలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సదస్సులు నిర్వహించి దీర్ఘకాలిక సమస్యలపై కసరత్తులు చేసి పరిష్కరించాల్సి ఉండగా, ఎక్కడా అలా జరిగిన దాఖలాలు లేవు. కేవలం సమస్యలపై అర్జీలు స్వీకరించి వెళ్లిపోయారనే వాదనలు ఉన్నాయి.

ఉద్యోగుల్లో కలవరం

రెవెన్యూ సదస్సులు అనేసరికి ప్రధానంగా తహసీల్దార్ కార్యాలయ అధికారులు, ఉద్యోగులతో పాటు సర్వేయర్లు, వీఆర్వోల్లో కలవరం ఏర్పడింది. ప్రజలు తమ సమస్యలను సదస్సు దృష్టికి పబ్లిక్‌గా తీసుకొచ్చే క్రమంలో రెవెన్యూ ఉద్యోగులపై ఫిర్యాదులు చేస్తూ వచ్చారు. ఏళ్ల తరబడి తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని కొందరు, డబ్బులు అడుగుతున్నారని మరికొందరు రెవెన్యూ అధికారులు, ఉద్యోగులపై ఆరోపణలు చేయడంతో అనేక సదస్సుల్లో రెవెన్యూ ఉద్యోగుల అవినీతి అక్రమాలు బయటపడ్డాయి. తమ బండారం ఎక్కడ బయటపడుతుందోనని పలువురు రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు భయంభయంగా సదస్సుల్లో గడిపారు. దీర్ఘకాలిక సమస్యలను వీలైనంత త్వరగా అధికారులు పరిష్కరిస్తేనే సదస్సులతో ఉపయోగం ఉంటుందని ప్రజలు అంటున్నారు.

ఇలా చేస్తేనే ప్రయోజనం...

రెవెన్యూ సదస్సుల్లో సాధ్యమైనంత వరకు అక్కడికక్కడే అర్జీలు పరిష్కరించాలి. క్షేత్రస్థాయి సందర్శనలతో ప్రతి సమస్యపై సమగ్ర విచారణ చేయాలి. గ్రామ సభ లక్ష్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలి. సమస్యపై సదస్సులో అందిన అర్జీపై తహసీల్దార్ బృందం విచారణకు వచ్చే సమయాన్ని ప్రకటించాలి. కోర్టు కేసులను, ముఖ్యంగా హైకోర్టు కేసులను గుర్తించడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి. గ్రామంలో భూ వివాదాలు ఉంటే వాటి పరిష్కారానికి తహసీల్దార్ ఎదుట ఒక ఒప్పందం జరగాలి. ఇరువర్గాలను అందుకు ఒప్పించాలి. వివాదాలను సామరస్యంగా పరిష్కరించడానికి రెవెన్యూ బృందం ప్రయత్నించాలి. సరిహద్దు వివాదాలు ఉంటే సర్వేయర్‌తో వెంటనే సర్వే చేయించి పరిష్కరించాలి.

ట్రూ అప్ చార్జీలు తొలగించాలి

- ఎఫ్‌పీసీసీఏ, ఇతర చార్జీలను కూడా..



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఈ కట్టా వెంకటేశ్వర్లు

ఒంగోలు సబర్బన్: విద్యుత్ బిల్లుల్లో ట్రూ అప్ చార్జీలు తొలగించాలని హెచ్‌టీ మీటర్ల వినియోగదారులు డిమాండ్ చేశారు. ట్రూ అప్ చార్జీలతో హెచ్‌టీ మీటర్ల వినియోగదారులను విద్యుత్ సంస్థ దోచుకుంటోందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక విద్యుత్ భవన్‌లో గురువారం ఏపీసీపీడీసీఎల్ జిల్లా ఎస్‌ఈ కట్టా వెంకటేశ్వర్లు జిల్లాలోని హైటెన్షన్ (హెచ్‌టీ) మీటర్ల వినియోగదారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రూ అప్ చార్జీలు, ఎఫ్‌పీసీసీఏ చార్జీలతో పాటు ఇతర అదనపు చార్జీలను కూడా వినియోగదారులపై వేయకుండా తొలగించాలని అధికారులను కోరారు. కొన్ని ప్రాంతాల్లో బిల్లులు సకాలంలో తీయడం లేదని, దీంతో మీటరు రీడింగ్ పెరిగి సరాసరిలో తేడాలు వస్తున్నాయని కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వినియోగదారులు తమ సమస్యలను, సూచనలను అధికారులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వినియోగదారుల నుంచి వచ్చిన సమస్యలను తన పరిధిలో ఉన్న వాటిని వెంటనే పరిష్కరిస్తానని, ఉన్నతాధికారుల స్థాయిలో జరగాల్సిన సమస్యలను సీఎండీకి నివేదిక రూపంలో అందజేస్తామని వివరించారు. ప్రత్యేకంగా సీఎండీ వినియోగదారులతో ముఖాముఖి నిర్వహించి నేరుగా సమస్యలను తెలుసుకొని నివేదిక రూపంలో అందించాలని ఆదేశించారని, అందులో భాగంగానే సమీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ (ఎస్ఏఓ) సుబ్బారావు, ఒంగోలు ఈఈ హరిబాబు, ఇతర అధికారులు వీరయ్య, శ్రీనివాసులు, నాగేశ్వరావుతో పాటు ఒంగోలు, దర్శి, కనిగిరి, కందుకూరు, మార్కాపురం విద్యుత్ డివిజన్లకు సంబంధించిన హెచ్‌టీ వినియోగదారులు పాల్గొన్నారు.



మహాలక్ష్మికి నివాళులర్పిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, ఆదిమూలపు సురేష్, వైఎస్సార్ సీపీ నాయకులు

దశదినకర్మకు హాజరైన వైఎస్సార్ సీపీ నాయకులు

సంతనూతలపాడు: వైఎస్సార్ సీపీ నేత, రిటైర్డ్ హెచ్‌ఎం గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డి సతీమణి మహాలక్ష్మి మృతిచెందగా, పేర్నమిట్ట పరిధిలోని పీర్లమాన్యం సమీపంలో గురువారం దశదినకర్మ నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, ఎంపీపీ, జెడ్పీటీసీలు, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, ఉద్యోగులు పాల్గొని మహాలక్ష్మి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఓబుల్‌రెడ్డికి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు, వైద్యుడు డాక్టర్ వరికూటి అమృతపాణి, ఎంపీపీలు యద్దనపూడి శ్రీనివాసరావు, బుడంగుంట విజయ, వి.అరుణ కోటిరెడ్డి, జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, వేమా శ్రీనివాసరావు, పలు మండలాల వైఎస్సార్ సీపీ కన్వీనర్లు దుంపా చెంచిరెడ్డి, మండవ అప్పారావు, పి.శ్రీమన్నారాయణ, పి.వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు ఐ.పిచ్చిరెడ్డి, మారెళ్ల బంగారుబాబు, మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ కనకారావు మాదిగ, వైఎస్సార్ సీపీ నాయకులు దుంపా యల్లమందారెడ్డి, శేషిరెడ్డి, శేఖర్‌రెడ్డి, ఎస్.కృష్ణారెడ్డి, కె.సుధాకర్‌రావు, మహానందిరెడ్డి, బొల్లినేని కృష్ణయ్య, తేళ్ల డేవిడ్‌రాజు, పి.ప్రవీణ్, బి.నాగేశ్వరరావు, పలువురు రిటైర్డ్ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయులతో బంతాట

- యాజమాన్యాలు, విద్యాశాఖాధికారుల తీరు దారుణం
- ఏపీ టీచర్స్ గిల్డ్ నాయకుల ధ్వజం

ఒంగోలు సిటీ: పోస్టుల నియామకం కోసం కోర్టుకు వెళ్లిన ఎయిడెడ్ పాఠశాలలకు వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఎయిడెడ్ టీచర్లను నియమించగా వారిని చేర్చుకోకుండా.. యాజమాన్యాలు, విద్యాశాఖాధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకొంటూ బంతాట ఆడుతున్నారని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటరావు, ప్రభాకరరెడ్డి గురువారం ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. యర్రగొండపాలెం డీఎం బీసీ ఎయిడెడ్ పాఠశాల నుంచి ముగ్గురు ఉపాధ్యాయులను కొమరోలు ఎన్‌బీఎన్ఆర్ స్కూల్‌కు, ముండ్లపాడు సెయింట్ జాకబ్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలకు మరో టీచర్‌ను గురువారం పంపిస్తే వారిని చేర్చుకోకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. వీరికి జీతాల బిల్లుల విషయంలో ఇబ్బందులకు గురి చేయకుండా చర్యలు తీసుకోవాలని ఆర్జేడీ లింగేశ్వర్‌రెడ్డిని యూనియన్ సభ్యులు కోరారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

ఒంగోలు సబర్బన్: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తూ విధి నిర్వహణలో భాగంగా ప్రమాదాల్లో మరణించిన ఉద్యోగుల కుటుంబాల్లోని వారసులతో కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్–1104 నాయకులు ఎస్‌ఈ కట్టా వెంకటేశ్వర్లును కోరారు. ఈ మేరకు స్థానిక విద్యుత్ భవన్‌లో గురువారం యూనియన్ నాయకులు ఆయనతో సమావేశమయ్యారు. 1104 యూనియన్ నాయకులు ఉద్యోగులకు సంబంధించిన పలు సమస్యలను ఎస్‌ఈ దృష్టికి తీసుకెళ్లారు. మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు యాజమాన్యం వర్క్‌మెన్ కాంపెన్సేషన్ వెంటనే చెల్లించాలని కోరారు. తన పరిధిలో ఉన్న విద్యుత్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని, మిగతావి ఏపీసీపీడీసీఎల్ సీఎండీ దృష్టికి తీసుకెళ్తానని ఎస్‌ఈ హామీ ఇచ్చారు. ప్రాంతీయ నాయకులు విద్యుత్ కార్మికుల సమస్యలపై వినతిపత్రం ఎస్‌ఈకి అందజేశారు. అనంతరం ఎస్‌ఈ కట్టా వేంకటేశ్వర్లు 1104 యూనియన్ డైరీ, వాల్ క్యాలెండర్ ఆవిష్కరించారు. ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104 జిల్లా అధ్యక్షుడు హరికృష్ణ, జిల్లా కార్యదర్శి సంజీవరావు, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు సురేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏవీ ప్రతాప్, ట్రెజరర్ రవి శంకర్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాల్లో చిన్నారులు, టీచర్లు

ఒంగోలు సిటీ: స్థానిక మంగమూరు రోడ్‌లోని నారాయణ కిడ్స్ ప్లే స్కూల్లో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు రంగవల్లుల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం విద్యార్థులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. అనంతరం చిన్నారుల కోలాటం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో కరస్పాండెంట్ కొల్లా సౌజన్య, ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు నాగలక్ష్మి, రమ, జ్యోతి, ఝాన్సీ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

12న మండల స్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్

సంతనూతలపాడు: సంక్రాంతి సందర్భంగా ఈ నెల 12వ తేదీ నుంచి సంతనూతలపాడులో మండల స్థాయి డబుల్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు మండల బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. స్థానిక హైస్కూల్లోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న ఈ పోటీల్లో పాల్గొనదలచినవారు 12వ తేదీ మధ్యాహ్నం 2 గంటల్లోపు ఎంట్రీ ఫీజు రూ.300 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.7,116, ద్వితీయ బహుమతిగా రూ.5,116, తృతీయ బహుమతిగా రూ.3,116 ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు ఎం.రామాంజనేయులు (8885533149)ను సంప్రదించాలని సూచించారు.

సాయిబాబాకు లక్ష గులాబీలతో పుష్పార్చన



లక్ష గులాబీల అర్చన అందుకుంటున్న సుందర సాయిబాబా

సంతనూతలపాడు: పేర్నమిట్టలోని శ్రీ షిరిడీ సుందరసాయి మందిరంలో సాయిబాబాకు గురువారం లక్ష గులాబీలతో పుష్పార్చన వేడుకలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎస్వీ రాఘవరావు, ఐ.జానకిరామయ్య తదితరుల ఆధ్వర్యంలో సాయిబాబాకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెంగళూరు నుంచి ప్రత్యేకంగా తెప్పించిన లక్ష గులాబీలతో సాయిబాబాకు పూజలు చేశారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు పేర్నమిట్ట హరిప్రసాదరావు, రావూరి వాసు తదితరుల ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు.

28 నుంచి ఇంధన వనరుల వినియోగ చైతన్య సదస్సులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్రాచారి

ఒంగోలు టౌన్: పెరుగుతున్న వాహన వినియోగంతో విడుదలవుతున్న కార్బన్ వాయువుల కాలుష్యంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పర్యావరణ పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 28,29,30వ తేదీల్లో ఒంగోలులో ఇంధన వనరుల వినియోగ చైతన్య సదస్సులు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్ జి. వీరభద్రాచారి తెలిపారు. గురువారం ఆ సంస్థ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సదస్సుల్లో భాగంగా మొదటి రోజు పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించేందుకు విద్యుత్ వాహనాల వినియోగం గురించి అవగాహన జరుగుతుందన్నారు. రెండో రోజు విద్యుత్ వాడకం బదులుగా సోలార్, పవన విద్యుత్‌లు వినియోగించేలా చైతన్యం చేస్తామన్నారు. మూడో రోజు సీఎన్‌జీ, బయో గ్యాస్ తదితర ప్రత్యామ్నాయాల గురించి ప్రజలలో అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు కందుకూరి రాంబాబు, దార్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల పంపిణీ

సంతనూతలపాడు: సంక్రాంతి వేడుకల్లో భాగంగా సంతనూతలపాడులోని షైనింగ్ స్టార్ ఎలైట్ స్కూల్లో గురువారం సాయంత్రం విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు స్కూల్ ప్రిన్సిపాల్ సీహెచ్ అనిత బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు.

ప్రజలపై అదనపు విద్యుత్ చార్జీలు రద్దు చేయాలి

దర్శి: జిల్లా ప్రజలకు సంక్రాంతి కానుకగా వచ్చిన విద్యుత్ బిల్లులు షాక్‌కు గురి చేస్తున్నాయని, అదనపు చార్జీలు రద్దు చేయాలని, భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం చేయాలని సీపీఎం జిల్లా కాద్యదర్శి వర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్య భవన్‌లో నియోజకవర్గ సీపీఎం సమావేశం ఈమని నాగేశ్వరరావు అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ జిల్లా ప్రజలపై 78 కోట్ల రూపాయలు విద్యుత్ అదనపు చార్జీల భారం మోపి ప్రజలను సంక్రాంతి పండగకు బెంబేలెత్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కంటే 50 శాతం పైగా విద్యుత్ చార్జీలు పెరిగాయని మండిపడ్డారు. దర్శిలో జనవరి 5వ తేదీన గృహ వినియోగదారులకు వచ్చిన కరెంటు బిల్లులు పరిశీలించగా రూ.219లు వాడిన చార్జీలు అయితే ఫిక్సిడ్ చార్జీ, కష్టర్ చార్జీ, డ్యూటీ, సర్‌చార్జీ, ట్రూ అప్ చార్జీ, ఎఫ్‌పీసీసీఏ4/22,7/23,11/24 తదితర చార్జీలు రూ.296 వచ్చాయని, మొత్తం కలిసి రూ.515లు బిల్లు వచ్చిందన్నారు. ఇలాగే 80 శాతం మందికి బిల్లు రావడంతో ప్రజలు షాక్‌కు గురవుతున్నారని చెప్పారు. ఎన్నికల హామీల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచమని, స్మార్ట్ మీటర్లు బిగించమని హామీలు ఇచ్చి మాటతప్పారన్నారు. ఇప్పుడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెంచిందని చెప్పి వాటిని రద్దు చేయక పోవడం అన్యాయంగా ఉందన్నారు.అదనపు చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తిరుపతి తొక్కిసలాట ఘటనపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మృతులకు, గాయపడిన వారికి నష్ట పరిహారం అందించాలని కోరారు. జిల్లా కమిటీ సభ్యులు తాండవ రంగారావు మాట్లాడుతూ రైతుల వద్ద వరిధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేయక పోవడంతో రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. వారు రూ.1400 మించి కొనుగోలు చేయక పోవడంతో రైతులు తీవ్ర నష్టాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో బస్తాకు రూ.400 వరకు రైతులు నష్టపోతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని మండిపడ్డారు. ప్రభుత్వం రూ.1740 కొనుగోలు చేస్తామని చెప్పిన మాటలు నీటి మూటలయ్యాయన్నారు. దర్శి ప్రాంత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శులు ఉప్పు నారాయణ, కేవీ పిచ్చయ్య, చిట్ట ఆదినారాయణ, పొట్లూరి పుల్లయ్య, అంజయ్య, రమాదేవి పాల్గొన్నారు.

వైకుంఠ దర్శనానికి వెళ్తే పైకి పంపారు

దర్శి: శ్రీ వారి వైకుంఠ దర్శనం టిక్కెట్ల కోసం వెళ్తే వారిని ఏకంగా పైకి పంపడం బాధాకరమని హైందవ శంఖారావం నియోజకవర్గ కన్వీనర్ యేరువ లక్ష్మీనారాయణరెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఆ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదు లక్షల మందితో విజయవాడలో సభ జరిపితే ఒక్క చిన్న ఘటన కూడా జరగలేదని చెప్పారు. అలాంటిది ఐదు వేల నుంచి 10వేల మంది వరకు ఉండే క్యూలైన్‌లో ఆరుగురు మరణించడం టీటీడీ వైఫల్యమే అని ఆరోపించారు. దీనికి టీటీడీ చైర్మన్, పాలక మండలి, అధికారులు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

తిరుపతి ఘటన బాధాకరం

తిరుపతి తోపులాట ఘటనలో ఆరుగురు మృతి చెందడం బాధాకరమని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర నాయకుడు జూపల్లి కోటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తిరుపతిలోని విష్ణు నివాసం వద్ద టోకెన్ల కోసం వచ్చిన వారిలో ఆరుగురు మృతి చెందగా 40 మందికి పైగా గాయపడ్డారన్నారు. ఈ ఘటనకు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.